క్లుప్తంగా

సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్



క్యాంపెయిన్ ఆకృతిలో విద్యార్థులు

కోరుట్ల: పట్టణ శివారులోని కల్లూర్ రోడ్‌లో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో మంగళవారం క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ ఆకృతిలో కూర్చున్నారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు పబ్లిక్ టాయిలెట్స్‌ను వినియోగించుకోవాలని కోరారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా మార్చేందుకు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వ్యాపారులకు జరిమానా



కవర్లు స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలో పలు కిరాణా, ప్లాస్టిక్ దుకాణాల్లో మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని వ్యాపారులకు జరిమానా విధించారు. ప్రభుత్వం 125 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల కవర్లపై నిషేధం విధించిందని, వాటిని విక్రయిస్తే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా వసూలు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, రవీందర్ తదితరులున్నారు.

పట్టణ సమస్యలపై మంత్రికి వినతి



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సంతోష్ రెడ్డి

కోరుట్ల: పట్టణానికి చెందిన కోరుట్ల అభివృద్ధి సంఘ ప్రతినిధి ఎల్లాల సంతోష్ రెడ్డి మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సమస్యలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని సంతోష్ రెడ్డి తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఇటీవల ధాన్యం కొనుగోళ్లను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించగా, రైతులు ఓ ప్రైవేట్ విత్తన కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని, పంట వేశారని ఇప్పుడు ఆ కంపెనీ ప్రతినిధి ధాన్యం కొనడానికి ముందుకు రాకపోవడంతో తమ వద్దకు తీసుకువచ్చారని, ఇది నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ కనీసం దీనిని కామన్‌కింద కొనుగోలు చేయాలని జిల్లా సహకార అధికారి సత్యనారాయణ దృష్టికి తీసుకురాగా విండో సీఈవో అయ్యోరి తిరుపతి కొనుగోలు చేయడానికి అంగీకరించారు. బీర్‌పూర్ తహసీల్దార్ నరేశ్ ,ఆర్ శ్రీనివాస్‌తో కలిసి నర్సింహులపల్లె ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించి రైతులకు నష్టం జరగకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని, రైతులకు సహకరించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం సన్మానించారు. హెచ్‌ఎం శ్రీరాముల కిషన్, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, నారాయణను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, ఎంపీటీసీ ప్రియాంక, గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, హెచ్‌ఎం,ఉపాధ్యాయులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండలం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోకి ఆర్టీసీ బస్సు నడిపించాలని మైతాపూర్ ఎంపీటీసీ రాజనాల మధుకర్, చెర్లకొండాపూర్ రాజ్యలక్ష్మి, కుమ్మరిపల్లి సర్పంచ్ చింతలపల్లి స్వప్న డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. కోరుట్ల, జగిత్యాల డిపో అధికారులు లక్ష్మీనారాయణ, శంకరయ్య జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కుమ్మరిపల్లిలోని ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు లీకవుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ చింతలపల్లి స్వప్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ బషీర్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. చింతలూరులో రెవెన్యూ భూముల వివరాలను తెలపాలని సర్పంచ్ అనుపురం శ్రీనివాస్ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ఇటీవల సర్వే నిర్వహించామని, రిపోర్ట్ రాగానే అందజేస్తామని తహసీల్దార్ సమాధానమిచ్చారు. భూపతిపూర్‌లో లెన్ పోల్స్ వేయాలని సర్పంచ్ చంద్రశేఖర్, చింతలూరులో ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ అనుపురం శ్రీనివాస్, కుమ్మరిపల్లిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ చింతలపల్లి స్వప్న ట్రాన్స్‌కో ఏఈ దృష్టికి తీసుకెళ్లగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతిపక్ష పాత్రలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలమంతా కలిసి అసెంబ్లీలో ప్రభుత్వం పోరాడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై పోరాటం

బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండి ప్రభుత్వంపై ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణ వర్తక సంఘంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు అధైర్య పడొద్దని, ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఇంతియాజ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టిబాబు

ధర్మపురి: మండలంలోని నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చిట్టిబాబు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించాల్సిన సమావేశం కోరం లేక మధ్యాహ్నం ప్రారంభించారు. ముందుగా ఎజెండాలో పేర్కొన్న అంశాలను ఆయా శాఖల అధికారులు చదివి వినిపించారు. వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశంలో లేవనెత్తారు. రామయ్యపల్లెలో ప్రభుత్వ పాఠశాలకు కాంపౌండ్ వాల్ కావాలని అధికారులకు పలుమార్లు తెలిపినప్పటికీ నేటికి నిర్మించలేదని సర్పంచ్ దుబ్బయ్య ఆరోపించారు. రాయపట్నం, నేరెళ్ల, గోవిందుపల్లె గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు ఉన్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గోవిందుపల్లెలో మూడేళ్లుగా తాగునీరు అందడం లేదని అధికారిపై సర్పంచ్ రాజయ్య మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల్లో బీఎల్‌వోలు నిర్వహించిన ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారిందని సర్పంచులు, ఎంపీటీసీలు ఆరోపించారు. బూరుగుపల్లెలో 15 మందికి రేషన్ బియ్యం రావడం లేదని సర్పంచ్ తిరుపతి తహసీల్దార్ కృష్ణ చైతన్యకు వివరించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాలేదని, బిల్లులు రాకుంటే ఆత్మహత్యే శరణ్యమని, జనవరి 30 లోగా బిల్లులు చెల్లించాలని రామయ్యపల్లె సర్పంచ్ దుబ్బయ్య విన్నవించారు. గత బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులు, అగ్రిమెంటు అయిన పనులను యథావిధిగా కొనసాగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ బత్తిని అరుణ, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

ఆదరించిన ప్రజలకు అండగా ఉంటా

• ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి: గెలిచినా, ఓడినా ప్రజల మధ్య ఉన్న తనను ఆదరించి అఖండ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించిన ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారి గొల్లపల్లి మండల కేంద్రానికి విచ్చేసిన లక్ష్మణ్ కుమార్‌ను మంగళవారం అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన ప్రజా అభినందన సభలో లక్ష్మణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు.కష్ట కాలంలో తనకు అండగా ఉండి ఆదరించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ఆదరించిన ప్రజలకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా తాను అండగా ఉంటానన్నారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది రోజుల్లోనే రెండు పథకాలు ప్రారంభించామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే ఆరు గ్యారంటీలు ప్రారంభించి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, కటారి చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో ఎమ్మెల్యే ‘అడ్లూరి’



కోడెతో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వేములవాడ: వేములవాడ రాజన్నను ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆయనవెంట సీఐ కరుణాకర్, ఆలయ పర్యవేక్షకుడు శ్రీరాములు తదితరులున్నారు.

లక్ష్మీపూర్ మీదుగా వెల్గటూర్‌కు బస్సులు నడపండి

జగిత్యాలజోన్: జగిత్యాల నుంచి లక్ష్మీపూర్, వెంగళాపూర్, నందిపల్లె, రాపల్లె మీదుగా వెల్గటూర్ మండలానికి ఆర్టీసీ బస్సులు నడిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆర్టీసీ ఉన్నతాధికారులకు మంగళవారం లేఖ రాశారు. జగిత్యాల నుంచి వెల్గటూర్‌కు బస్సులు నడిపిస్తే జగిత్యాల రూరల్, గొల్లపల్లి, వెల్గటూర్ మండలాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

ప్రాణహాని ఉందని ఫిర్యాదు

మెట్‌పల్లి: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌పై ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినందుకు తనను కొందరు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పుల్లా రాజాగౌడ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యేతో పాటు బెదిరింపులకు గురి చేస్తున్న వారితో తనకు ప్రాణహాని ఉందని, విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

కోరం లేక సమావేశం వాయిదా



సమావేశంలో ఎంపీడీవో, వైస్ ఎంపీపీ కవిత

వెల్గటూర్: మండల సర్వసభ్య సమావేశం ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడంతో కోరం లేక వాయిదా పడింది. గత సమావేశం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజా ఆశీర్వాదయాత్ర సందర్భంగా ప్రజాప్రతినిధులు ఎంపీపీ, ఎంపీటీసీలు హాజరు కాక వాయిదా వేశారు. కాగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మెజారిటీ ఎంపీటీసీలు ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరడంతో సోమవారం ఎంపీపీ కూనమల్ల లక్ష్మిపై అవిశ్వాస తీర్మానం ఇవ్వడంతో 10 మంది ఎంపీటీసీలు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి రాకపోవడంతో మరోసారి కోరం లేక సమావేశం వాయిదా వేస్తున్నట్లు వైస్ ఎంపీపీ ముస్కు కవిత ప్రకటించారు. ఇలా వరుసగా సర్వసభ్య సమావేశాలు వాయిదా పడడంతో గ్రామాల్లో ప్రజాసమస్యలు ప్రస్తావన, సమస్యలకు పరిష్కార వేదికైన సర్వసభ్య సమావేశాలపై ప్రజాప్రతినిధులకు ఉన్న పట్టింపు ఏమిటో తెలుస్తోందని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ప్రజా సమస్యలపై సభ్యులకు పట్టింపు లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సభ్యులు సర్వసభ్య సమావేశానికి హాజరై ప్రజా సమస్యలు చర్చించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తా

• కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆటో డ్రైవర్లు

మెట్‌పల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలు సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఉచిత ప్రయాణంతో తమ ఉపాధి దెబ్బతింటుందని, దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకపోవాలని ఆటో డ్రైవర్లు ఆయనను కోరారు. సన్మానం చేసే వాళ్లు పుష్పగుచ్ఛాలు తీసుకరావొద్దని ఎమ్మెల్యే చేసిన సూచనతో పలువురు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మల్లాపూర్: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు.మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్ సర్పంచ్ సయ్యద్ హైదర్, గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకాన్ని అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న షీటీం ఏఎస్సై అలీబేగ్

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీటీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏసీఈ హైస్కూల్‌లో షీటీం ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930, డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులు తమ ఇళ్లలో ఉన్న తల్లిదండ్రులకు, ఇరుగుపొరుగు వారికి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మహిళ హక్కులు, రక్షణ కోసం షీటీం నిరంతరం పనిచేస్తుందన్నారు. విద్యార్థినులు, మహిళలు, అమ్మాయిలను వేధిస్తే షీటీం హెల్ప్‌లైన్ నంబరు 87126 70783, లేదా డయల్100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మహిళ కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇటిక్యాల వాసికి డాక్టరేట్

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన నల్లపు మల్లారెడ్డి శాతవాహన విశ్వవిద్యాలయంలో సింథసిస్ ఆఫ్ న్యూ మాలిక్యూలర్ హైబ్రిడ్స్ కంటైనింగ్ ట్రైఅజోల్ ఫార్మాకోఫర్ అండ్ దేర్ ఆంటీ క్యాన్సర్ ఎవల్యూషన్ అనే అంశంపై రసాయన శాస్త్రంలో విశిష్ట పరిశోధనకు గాను డాక్టరేట్‌ను విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య మల్లేశ్, ఆచార్య వరప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిని రసాయన శాస్త్ర విభాగాధిపతి నమ్రత అభినందించారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకం చేపట్టాలి

జగిత్యాల: ఆర్టీసీలో కారుణ్య నియమకాలు చేపట్టాలని దుబాయ్ నుంచి వెంకటేశ్ అనే యువకుడు వీడియో సందేశం పంపించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్‌కు చెందిన రాగుల వెంకటేశ్ తండ్రి మల్లయ్య జగిత్యాల ఆర్టీసీ డిపోలో పనిచేసేవాడు. అప్పట్లో బస్సు రిపేరు చేస్తుండగా బలమైన రాడ్డు కాళ్లపై పడటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. అనంతరం వైద్య పరీక్షలకు వెళ్లగా ఉద్యోగం చేసేందుకు పనికిరావని వైద్యులు తేల్చగా కొద్దిరోజుల తర్వాత మరణించాడు. వెంకటేశ్ ఆర్టీసీలో కారుణ్య నియమకం కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో దుబాయ్ వెళ్లాడు. ఆర్టీసీలో కారుణ్య నియమకం కింద ఉద్యోగం ఇప్పించాలని దుబాయ్ నుంచి వెంకటేశ్ ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.

సంక్షిప్త వార్తలు

హంతున్ని కఠినంగా శిక్షించాలి

వెల్గటూర్: గుప్త నిధుల కోసమని మూఢ నమ్మకంతో 15 మందిని హత్య చేసిన నిందితుడు సత్యం యాదవ్‌ను కఠినంగా శిక్షించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎండపల్లిలో నరేశ్ మాట్లాడారు. నాగర్ కర్నూల్ జిల్లాలో గుప్త నిధుల పేరుతో ప్రజలను నమ్మించి క్షుద్రపూజలు చేసి లక్షలాది రూపాయలు వసూలు చేసి 15 మంది అమాయకుల ప్రాణాలు తీసిన నిందుతుడిని కఠినంగా శిక్షించాలని కోరారు., అమాయక ప్రజలను భూతవైద్యం పేరుతో మోసం చేస్తున్న దొంగ స్వాములను కూడా గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నరేశ్ కోరారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరివృతం కాకుండా చూడాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ. 20 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన గొట్టిపడుత రాజు ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లి పక్షవాతానికి గురై దుర్భర జీవితం గడుపుతుండగా, పలువురు యువకులు మంగళవారం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రాజుకి పరిస్థితిని అక్కడి కార్మికుల ద్వారా తెలియడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారని, రాజును స్వదేశానికి తెప్పించేందుకు సాయం చేయాలని కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో యువకులు ఇల్లెందుల మనోజ్‌కుమార్, తుమ్మనపెల్లి విష్ణు, లవంగ శివకుమార్, నాగుల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు రీటెండర్ నిర్వహించాలి

మెట్‌పల్లి: పట్టణంలో పెండింగ్‌లో ఉన్న పనులను సంబంధిత కాంట్రాక్టర్లు పూర్తి చేయకుంటే అధికారులు వాటికి రీటెండర్ నిర్వహించాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం కోరారు. పట్టణంలో ఆయన మాట్లాడారు. పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంక్ బండ్, జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైయినేజీ, పలు పాఠశాలల అభివృద్ధి పనులు చాలా కాలంగా పెండింగ్ ఉన్నాయన్నారు. వీటిని కాంట్రాక్టర్లు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారు స్పందించకుంటే పనులను రద్దు చేసి రీటెండర్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరం

మల్యాల: మండలంలోని నూకపల్లిలో మంగళవారం సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అపూర్వ రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మారంపల్లి సరోజన, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టీఆర్టీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా రణధీర్

కోరుట్ల రూరల్: పట్టణానికి చెందిన గంగుల రణధీర్ టీఆర్టీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ధర్మపురిలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రణధీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రణధీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకుపెండింగ్ డీఏలు,పీఆర్సీ ఏరియర్స్, ఇతర పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.సురేశ్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, నాయకులు

18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

సారంగాపూర్: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని సారంగాపూర్ తహసీల్దార్ రమేశ్ అన్నారు. డిసెంబర్ 30 వరకు అర్హత ఉన్న వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎవరైనా తప్పుగా పేర్లు ఉంటే సరిచేసుకోవాలని కోరారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో నేటి నుంచి 17వరకు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా విష్వక్సేనవిధిః, వాసుదేవ పుణ్యాహవవాచనవిధిః, రుత్విగ్వరణం, దీక్ష స్వీకారం, మహదీపస్థాపన,నవ కలశస్థాపన, చాయాధివాసం, పంచవింశతి క్షీరాభిషేకం, విశేషభోగం, ధాన్యాధివాసం, అన్నదానం,తీర్థప్రసాద వితరణ ఇతర పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులుతెలిపారు. చివరి రోజున స్వామి వారిని ప్రతిష్ఠించి, భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేటలో మంగళవారం సింగిల్ విండో డైరెక్టర్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదునెట్టాంబడిని పూలు, పండ్లతో అలంకరించి గురుస్వామి సంజీవ సంభూద్రి చేతుల మీదుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు భజనలతో హోరెత్తించారు.

17న క్రాస్ కంట్రీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

కోరుట్లటౌన్: ఈనెల 23న జరిగే 9వ రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పరుగుల పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 17న కోరుట్లలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఏలేటి ముత్తయ్యరెడ్డి, ఉపాధ్యక్షుడు అంజయ్య తెలిపారు. 16 ఏళ్లలోపు బాలబాలికలకు 2 కిలోమీటర్లు, 18 ఏళ్లలోపు వారికి 6-4, ఇరవై ఏళ్లలోపువారికి 8-6, పురుషులు, మహిళలకు 20 కిలోమీటర్ల పరుగు పందెంలో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు తహసీల్దార్ జారీ చేసిన జనన ధృవీకరణపత్రాలతో ఈనెల 17న ఉదయం7 గంటలకు పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో రిపోర్టు చేయాలని అసోసియేషన్ జిల్లా కోశాధికారి కొమురయ్య, సీహెచ్, శంకర్ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

ధర్మపురి: మండలంలోని మగ్గిడిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన మ్యాక హృతిక్ అనే విద్యార్థి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గత నెలలో ఉమ్మడి కరీంనగర్‌లో జరిగిన అండర్ - 14 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 14న నారాయణఖేడ్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ రాజమణి, పీఈటీ, పీడీ సంతోష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందిచారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో అంబారిపేట విద్యార్థిని ప్రతిభ

కథలాపూర్: మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని తోకల శాలిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ గంగరాజం, హెచ్‌ఎం కిషన్‌రావు, పీఈటీ వాసాల రాజు, సీఆర్‌పీ హన్మాండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు డిసెంబర్ 9, 10న ఇండోర్ స్టేడియంలో జరిగిన ఓపెన్ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. అలాగే వీరు జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు సైతం ఎంపికయ్యారు. సహస్ర, విష్ణువర్ధిని, జ్యోతినాథ్, బద్రినాథ్, సహస్ర, సుమైర్, వర్షిక్, విశాల్, అర్హముద్దీన్, రజిత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు అభినందించారు.

డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె

మెట్‌పల్లి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద మూడు మండలాలకు చెందిన ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, పదవీ విరమణ అనంతరం పెన్షన్ అందించాలన్నారు. కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫారూఖ్ అలీ, గణేశ్, స్నేహామాల, అరుణ్, సత్యనారాయణ, కొండయ్య తదితరులున్నారు.

సిరికొండలో తపాలా ఉద్యోగుల నిరసన

కథలాపూర్: మండలంలోని సిరికొండ సబ్ పోస్టాఫీస్ వద్ద తపాలా ఉద్యోగులు మంగళవారం నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె చేస్తామని ఉద్యోగులు పేర్కొన్నారు. 11 డిమాండ్లను నెరవేర్చాలని నినదించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.